క్లుప్తంగా

ఉత్తమ సేవలకు ప్రతిభ అవార్డు



పెనమలూరు: పెనమలూరు మండల డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ జి.కృష్ణంరాజుకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎస్పీ గంగాధరరావు, ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ చేతుల మీదుగా కృష్ణంరాజు సర్టిఫికెట్ అందుకున్నారు. మండలంలోని డ్వాక్రా మహిళలకు ఆయన ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డు వచ్చింది.

19, 20వ తేదీల్లో వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో లాకుల వద్ద వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గమ్మవారి ఆలయంలో ఈ నెల 19, 20వ తేదీల్లో అమ్మవారి చీరల వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దేవదాయ అధికారుల సమక్షంలో చీరల వేలంపాట ఉంటుందని ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు. అలాగే ఆలయంలో కొబ్బరి చిప్పల వేలంపాట ఈనెల 19న నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: తాడిగడప జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలు అవ్వడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నంకు చెందిన వీరంకి సరిత పోరంకిలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. ఆమెకు శుక్రవారం ఆరోగ్యం బాగాలేకపోవడంతో కానూరులో ఉంటున్న సోదరి ఆరేపల్లి రమాదేవితో కలసి పోరంకికి ఇద్దరు స్కూటీపై బయలుదేరారు. వారు తాడిగడప జంక్షన్ బస్ స్టాప్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన కారు వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు రోడ్డుపై పడిపోవడంతో రక్తం గాయాలు అయ్యాయి. వారిని పోరంకిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకుగానూ హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్‌డివిజన్ అధికారులు సేవా పురస్కారాలు అందుకున్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మచిలీపట్నంలో జరిగిన వేడుకల్లో ఏపీసీపీడీసీఎల్ ఎస్‌ఈ ఎం.సత్యానందం చేతుల మీదగా హనుమాన్‌జంక్షన్ విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బొజ్జగాని శ్రీనివాసరావు, ఏఈ ఐనాల రుక్మిణీ కల్యాణి, లైన్ ఇన్‌స్పెక్టర్ మళావతు నాగమల్లేశ్వరరావు సేవా పురస్కారాలు పొందారు. విద్యుత్ వినియోగదారులకు విశేష సేవలు అందించడంపై అభినందిస్తూ ప్రశంసా పత్రాలను అందుకున్నట్లుగా వారు తెలిపారు.

కష్టపడితేనే ఉత్తమ భవిత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కష్టపడి చదివితేనే ఉత్తమ భవితను సొంతం చేసుకుంటారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ జోనల్ హెడ్ సీతారామారావు సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆంథోని బాలికల పాఠశాల (ఆర్‌సీఎం స్కూల్)లో విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సీతారామారావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. పెద్దలు చెప్పే నీతిని, మంచిని పిల్లలందరూ అలవర్చుకొని చదువులో బాగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ సోనీ ప్రశాంత్, విజయవాడ మెయిన్ బ్రాంచి హెడ్ సౌజన్య, కరస్పాండెంట్ మేరీరాణి, ప్రిన్సిపాల్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురిస్తే నరకయాతనే!

- మోక్షం లేని కానూరు రోడ్డు
- రోడ్డు నిర్మాణంలో జాప్యం
- అస్తవ్యస్తంగా డ్రెయిన్లు
- గుంతలమయంగా రహదారి



డ్రెయినేజీ, వర్షం నీటితో మునిగిన కానూరు ప్రధాన రహదారి

పెనమలూరు: కానూరు గ్రామానికి పట్టిన గ్రహణం వీడటం లేదు. గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగునీరు, గుంతలతో ప్రజలు నరకం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కానూరు ప్రధాన రహదారి నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడుస్తున్నా రోడ్డుకు దిక్కుమొక్కు లేకుండా పోయింది. కానూరు బందరు రోడ్డు కామయ్యతోపు నుంచి ప్రసాదంపాడు వరకు కానూరు రోడ్డు విస్తరించి ఉంది. అయితే ప్రధానంగా కామయ్యతోపు నుంచి చెరువు వరకు ఉన్న రోడ్డులో రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఆటోనగర్‌కు వెళ్లే కార్మికులు, విద్యార్థులు, సిటీ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు ఎక్కువగా తిరుగుతుంటాయి. గ్రామ జనాభా దాదాపు 70 వేల మంది వరకు ఉన్నారు. దీంతో ప్రధాన రహదారి ఎప్పుడూ ట్రాఫిక్‌తో ఉంటుంది. కానూరు ప్రధాన రహదారి దారుణంగా మారింది. ఈ రోడ్డును 80 అడుగులు విస్తరించడానికి గతంలో జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఆమోదించారు. అయితే ఇప్పటివరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదు. గుంతలతో ఉన్న రోడ్డును కూడా కొత్తగా వేయలేదు. సంక్రాంతికి రోడ్డుపై గుంతలు లేకుండా చేస్తామని టీడీపీ నేతలు ప్రగల్భాలు పలికారు. ప్రధానంగా డ్రెయినేజీ నిర్మాణం చేస్తామని గ్రామస్తుకు హామీ ఇచ్చారు. అయితే శంకుస్థాపనలు చేసినా పనులు చేపట్టలేదు.

వర్షం చినుకుపడితే చిత్తడే....

కానూరు ప్రధాన రహదారి గ్రామ ప్రజలకు దినదినగండంగా మారింది. వర్షం చినుకుపడితే రోడ్డుపై మురుగునీరు పెద్ద ఎత్తున చేరుతుంది. వాహనాల రాకపోకలతకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షంనీరు

ప్రధాన రహదారిపై మురుగునీరు చేరడంతో జలదిగ్బంధం ఏర్పడుతుంది. రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది.

తుస్సుమన్న నేతల హడావుడి....

కాగా ఇటీవల వర్షాలు కురవడంతో కానూరు ప్రధాన రహదారి ప్రాంతం మునగడంతో కూటమి నేతలు రోడ్డు వేస్తామని హడావుడి చేశారు. రోడ్డుకు అక్కడక్కడ తాత్కాలిక మరమ్మతులు చేసి ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. తాము ఎంతో కష్టపడి పగలనక రాత్రనక కూర్చొని రోడ్డు వేయిస్తున్నామని బిల్డప్ ఇచ్చారు. తీరా రోడ్డు వేయకుండా మరమ్మతులు చేసి వదిలేశారు. ఇప్పుడు కురిసిన వర్షాలకు మరలా రోడ్డు గుంతలయమంగా మారింది. వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

శాశ్వత పరిష్కారం లేదా..?

కానూరులో ప్రధాన రోడ్డుతో పాటు డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. సంక్రాంతి నాటికి రోడ్డు అద్దంలా మారుస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం కానూరు రోడ్డు ఎందుకు వేయడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి పనులు చేపట్టకపోవడానికి కారణం తెలపాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు, డ్రెయిన్ నిర్మించాలి



కానూరు ప్రధాన రోడ్డుతో పాటు డ్రెయినేజీలు వెంటనే నిర్మించాలి. సమస్య పరిష్కారంలో పాలకులు చొరవ చూపాలి. ఇక్కడ పరిస్థితులు దారుణంగా ఉండటంతో నరకం చూస్తున్నాం.

– రాజారావు, కానూరు

వాలీబాల్ పోటీలు ప్రారంభం

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం వాకర్స్ అసోసియేషన్ గన్నవరం శాఖ, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని కోరారు. క్రీడా ప్రాంగణం అభివృద్ధికి వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ పోటీల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 20 వాలీబాల్ జట్లు పాల్గొంటున్నాయని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ తెలిపారు. వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 21 వేలు నగదు బహుమతులతో పాటు ఉత్తమ క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు ఈ నెల 19న అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రస్సులను అందజేశారు. వాకర్స్ అసోసియేషన్‌కు చెందిన కేఎస్ బాబురావు, ముక్కామల సుబ్బారావు, టీఎస్‌ఆర్కే ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, బీ కోటేశ్వరరావు, యనమల సుబ్బారావు, రోటేరియన్లు కంభంపాటి సూర్యచంద్రరావు, కేఎస్ జగదీశ్వరరావు, పీఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ, విశ్రాంత సైనిక ఉద్యోగి డీ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్, వాకర్స్ ప్రతినిధులు

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



కానూరులో గౌతులచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవభక్తుని చక్రవర్తి



పోరంకిలో గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్

పెనమలూరు: పోరంకి గ్రామంలో శనివారం సర్దార్ గౌతులచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్ గౌతులచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం గౌతు లచ్చన్న స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్నారన్నారు. ఆయన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. గౌతులచ్చన్న సేవలు ఎన్నటికి మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, దోనేపూడి రవి, పీతా గోపీచంద్, రామ్‌కుమార్, ఇర్ఫాన్ పాషా పాల్గొన్నారు.

సర్దార్ గౌతులచ్చన్న సేవలు మరువలేనివి

పెనమలూరు: సర్దార్ గౌతులచ్చన్న చేసిన సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పేర్కొన్నారు. కానూరు పార్టీ కార్యాలయంలో శనివారం గౌతులచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతులచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చక్రవర్తి మాట్లాడుతూ గౌతులచ్చన్న ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వేమూరి బాలకృష్ణ, మాదు శ్రీహరి రాణి, షేక్ అబుకలాం, జంపాన కొండలరావు, షేక్ ఖలీల్, కె.వరప్రసాద్, కాసాని ఫణి, వీర్ల జగదీష్, బడుగు రాజేష్, బి.నాగబాబు, మాదు రాఘవ, దూడల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గౌతులచ్చన్న

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక మహాత్మాగాంధీనగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్య్ర సమరయోధుడు గౌతు లచ్చన్న జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో త్రినాథరావు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీనవర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. పంచాయతీ రాజ్ ఏఈ డి.జయరాజు, ఎంపీటీసీ సభ్యులు పుసులూరి లక్ష్మీనారాయణ, పడకల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత చందు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతన్నకు శాపం



కంకిపాడు: రోడ్డు నిర్మించడం ఏమో కానీ, రోడ్డు బరంతుతో రైతులకు కష్టాలొచ్చి పడ్డాయి. సాగు నీటి కాలువ పూడుకుపోతుండటంతో సాగు ప్రశ్నార్థకం అవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. కంకిపాడు పట్టణంలోని చెరువు కాలువ నుంచి గొల్లగూడెం వైపు వెళ్లే పంట బోదె వెంబడి డొంక రోడ్డును సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేశారు. రోడ్డుకు ఇరువైపులా రబ్బిష్‌తో బరంతు ఏర్పాటు చేశారు. ఇంత వరకూ బాగానే ఉంది. అయితే బరంతు వల్ల పంట బోదె పూడుకుపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు మీటర్లు పైగా ఉండాల్సిన బోదెలో రోడ్డు బరంతు సుమారు మీటరు పైగా జారిపోయింది. దీంతో పంట బోదె పూడుకుపోయి సాగునీరు అందే పరిస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు. పొలాల్లో మురుగు తరలించేందుకు సైతం ఈ బోదెనే వినియోగిస్తున్నామని చెబుతున్నారు. ఇప్పుడు బోదె పూడుకుపోవడంతో దీని పరిధిలో సాగులో ఉన్న సుమారు 100 ఎకరాల్లో పంట పొలాల సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట బోదెను పరిరక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానిక రైతులు చెబుతున్నారు.

ఆటోడ్రైవర్‌కు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్‌టీఎస్ రోడ్డులో రోడ్డు దాటుతున్న ఆటో డ్రైవర్‌ను వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ రాజారావు గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... భానూనగర్‌కు చెందిన పెదపూడి రాజారావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈయన శనివారం ఉదయం టిఫిన్ కోసం బీఆర్‌టీఎస్ రోడ్డులో రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం రాజారావును ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన రాజారావును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

వైఎస్సార్ సీపీ పెనమలూరు ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి



కానూరులో మాట్లాడుతున్న చక్రవర్తి

పెనమలూరు: రైతులకు ఎరువులు సరఫరా చేయలేని దౌర్భాగ్య స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని, ఎరువులు అందించడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి విమర్శించారు. కానూరు పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ మొదలై ఇప్పటికి నెల దాటిందన్నారు. యూరియా, డీఏపీ, పోటాష్ ఎరువులు ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో దాదాపు 30 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో 25 సొసైటీలు, రైతుసేవా కేంద్రాలు ఉన్నా అరకట్ట ఎరువులు కూడా రైతుకు ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేకపోతోందని ప్రశ్నించారు. ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటల బీమా కూడా ఎత్తివేశారని, రైతులకు అదనపు ఆర్థిక భారం ప్రభుత్వం మోపిందని అన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో సొమ్ము ఇచ్చి, బీమా పేరుతో తిరిగి దోచేసుకున్నారని ఆరోపించారు. గత జగనన్న ప్రభుత్వంలో ఏనాడు రైతులు ఇబ్బంది పడలేదని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అష్టకష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని, ఎమ్మెల్యే బోడెప్రసాద్ వస్తే రైతులు కష్టాలు చూపెడతానని సవాల్ చేశారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు మాదుశ్రీహరిరాణి, షేక్ అబురలాం, వేమూరి బాలకృష్ణ, నేతలు ఫజల్ హక్, జంపాన కొండలరావు, షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పెనమలూరులో పూజలు చేస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి



రామవరప్పాడులో ఉట్టికొడుతున్న యువకులు



కోలవెన్నుల్లో రంగులు చల్లుకుంటూ వేడుక చేసుకుంటున్న యువత



పోరంకిలో శ్రీవేణుగోపాలస్వామి

దావాజీగూడెం(గన్నవరం): మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణునికి స్నపన తిరుమంజనం, వివిధ రకాల పుష్పమాలలతో విశేష అలంకరణ చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఎన్.రామాచార్యులు నేతృత్వంలో 200 మంది భక్తులచే తులసీదళాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు శ్రీకృష్ణాష్టమి ప్రత్యేక ప్రసాదం కట్టికారం వితరణగా అందజేశారు. సాయంత్రం చిన్నారులచే ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఇందులో పాల్గొన్న చిన్నారులకు ఆలయ కమిటీ వారు బహుమతులు ప్రదానం చేశారు. కేసరపల్లిలోని శ్రీకృష్ణస్వామి ఆలయాన్ని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చినకంచిలో..

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి వారి దేవస్థానంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి. గోశాలలో ఉన్న రాధాకృష్ణుల మూర్తులకు అభిషేకార్చనలు చేసి విద్యార్థులు విష్ణు సహస్రనామం పారాయణం చేశారు. వేద పాఠశాల విద్యార్థులు, పిల్లలు ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆడికృత్తిక కావడంతో సుబ్రహ్మణ్యంస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అలాగే గ్రామంలోని గోకుల మందిరంలో జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు.

కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి

పెనమలూరు: పెనమలూరు శ్రీకృష్ణాలయంలో శనివారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ దాదాపు 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోమా ఆనంద్‌ప్రసాద్, నెర్సు సతీష్, ఆలయ కమిటీ సభ్యులు గోగం ఏడుకొండలు, వెంకటేశ్వరరావు, గోగం నాగయ్య, గోగం పండు, వీరబోయిన రాము, భక్తులు పాల్గొన్నారు.

కంకిపాడులో..

కంకిపాడు: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం కంకిపాడు, ఈడుపుగల్లు, కోలవెన్ను, మంతెన తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఉట్టికొట్టే సన్నివేశాన్ని యువత సందడిగా జరిపించారు. వేడుకల్లో భాగంగా రంగులు చిమ్ముకుంటూ యువత ఉత్సాహంగా గడిపారు. కోలవెన్ను గ్రామంలో రామ్ లక్ష్మణ్ యువత ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, గూడవల్లి గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. గోపూజ, జెండా వందనం, మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించారు. సాయంత్రం పూజల అనంతరం నిర్వహించిన ఉట్టికొట్టె కార్యక్రమాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పెనమలూరు: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా చేశారు. శ్రీకృష్ణుడి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కానూరు శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కళాకారులు గ్రామ ప్రధాన రహదారి ఆలయం వద్ద కోలాటం చేశారు. మహిళా కళాకారులు చేసిన కోలాటం ఆకట్టుకుంది. పోరంకి, యనమలకుదురు గ్రామల్లోని శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయాల్లో కృష్ణాష్టమి వైభవంగా చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కృష్ణాష్టమి వేడుకల్లో వంశీమోహన్



కేసరపల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి యాదవుల బజార్‌లోని శ్రీకృష్ణస్వామి ఆలయంలో శనివారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న వంశీమోహన్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుశ్శాలువాతో సత్కరించారు. వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి, వైఎస్సార్ సీపీ నేతలు పలగాని శివాజీ, మెండెం రాంబాబు, కొలుసు వెంగళరావు, సాతులూరి రవిప్రకాష్, పలగాని కిషోర్, కాటూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాలుగా నిరీక్షణ

- ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కోసం ఎదురుచూపులు
- గత ప్రభుత్వంలో రూ. 3 కోట్ల నిధులు మంజూరు
- పట్టించుకోని పాలకులు



ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదించిన ప్రాంతం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కోసం రైతులతో పాటు గృహ నిర్మాణ లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఇక్కడ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ జలవనరుల శాఖ అనుమతుల మంజూరులో జాప్యం చోటుచేసుకుంది. తీరా పనులు ప్రారంభించే సమయానికి వంతెన ఎత్తుపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో నిర్మాణ పనులు అటకెక్కాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణం ఊసే ఎత్తకపోవడంతో రైతలతో పాటు గృహ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వంతెన నిర్మాణానికి బదులుగా ప్రత్యామ్నాయ రహదారి మార్గాలను ప్రతిపాదించడం పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇక్కడ వంతెన నిర్మాణం జరిగితే గృహ నిర్మాణాలు వేగవంతం కావడంతో పాటు రైతులు, కూలీలు పొలాలకు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది.

మండలంలోనే అతిపెద్ద లేఅవుట్

గ్రామంలోని ఏలూరు కాలువ పక్కనే ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు మరో 78 ఎకరాలు రైతుల నుంచి కొనుగోలు చేసిన భూములను ఐదు లేఅవుట్లుగా అభివృద్ధి చేశారు. ఇక్కడ గన్నవరం, కేసరపల్లితో పాటు మరో ఐదు గ్రామాలకు చెందిన 3,198 మంది లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున నివేశన స్థలాలు కేటాయించారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేసుకునేందుకు వీలుగా విద్యుత్, రహదారులు, తాగునీటి వంటి సదుపాయలను కల్పించారు. ఈ లేఅవుట్లకు ప్రధాన మార్గంగా కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 3 కోట్లు నిధులు కేటాయించింది. టెండర్ ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభించే సమయానికి ఏలూరు కాలువలో భవిష్యత్ జలరవాణా అవసరాల దృష్ట్యా వంతెన నిర్మాణం ఎత్తుపై ఇరిగేషన్ శాఖ అభ్యంతరాలు తెలిపింది. దీంతో వంతెన నిర్మాణ ప్రక్రియ నిలిచిపోవడంతో గృహ నిర్మాణ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కాలనీవాసులు రహదారి మార్గంగా ఉపయోగిస్తున్న ఏలూరు కాలువ గట్టుపై ఇటీవల బీటీ రోడ్డు నిర్మాణం చేశారు. అయితే గృహ నిర్మాణ సామాగ్రి తరలించేందుకు ఈ రహదారి సౌకర్యవంతంగా లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటి వరకు కాలనీలో సుమారు వంద మంది లబ్ధిదారులు మాత్రమే గృహ నిర్మాణాలు పూర్తిచేశారు. ఇక్కడ వంతెన నిర్మాణం చేస్తే గృహ నిర్మాణాలు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

అవస్థలు పడుతున్న అన్నదాతలు

అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మించాలనేది పరిసర గ్రామాల రైతుల దశాబ్దాల కల. గతంలో ఇక్కడ ఉండే బల్లకట్టు ద్వారా రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాలకు రాకపోకలు సాగించారు. పదేళ్ల క్రితం బల్లకట్టు తుప్పుపట్టి మూలన పడటంతో పొలాలకు వెళ్లేందుకు సుమారు మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ వంతెన నిర్మాణం చేయాలని రైతులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వంతెన నిర్మిస్తే రైతులు పండించిన పంటలను కూడా సులభంగా ఇళ్లకు తరలించుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు, గృహ నిర్మాణ లబ్ధిదారులు కోరుతున్నారు.

వేతనాల కోసం కార్మికులు ఉద్యమించాలి

ఇబ్రహీంపట్నం: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు వేతనాల కోసం ఉద్యమాలు చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.